సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 26 । జూన్ । 2025



తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రూ.8 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. -8లో▸



రైతుల గోస అర్థం చేసుకోండి

భూమిపట్టాలు రద్దు చేయడంతో కేసముద్రం మండలంలోని నారాయణపురం రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. -8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

వార్షిక లాభాల్లో 40శాతం వాటా ఇవ్వాలి



భూపాలపల్లి అర్బన్: 2024–25 ఆర్థిక సంవత్సరం సింగరేణి లాభాల్లో వాటాను కార్మికులకు 40శాతం ఇవ్వాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం గత లాభాలను నేటికీ ప్రకటించలేదన్నారు. లాభాలు ప్రకటించి కార్మికులకు అందించాలని కోరారు. సమావేశంలో జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, జయశంకర్, సాజిత్ పాల్గొన్నారు.

నియామకం



ప్రేమ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన గుజ్జల ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు. ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జాన్‌రెడ్డి.. ప్రేమ్‌కుమార్‌ను కన్వీనర్‌గా నియమించారు.

ముగిసిన క్రీడాపాఠశాల ఎంపికలు



భూపాలపల్లి అర్బన్: క్రీడాపాఠశాల జిల్లా స్థాయి ఎంపికలు బుధవారం ముగిసినట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు అన్ని మండలాల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. 11 మండలాల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొనగా జిల్లా స్థాయికి 20 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జూలై 1వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని డీవైఎస్ఓ తెలిపారు.

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలన



మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లి, వేములపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పీడీ లోకిలాల్, పంచాయతీరాజ్ డీఈ రవికుమార్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు



టేకుమట్ల: గ్రామాల్లో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని వరంగల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంతోపాటు, అంకుషాపూర్, సోమనపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, 450 లీటర్ల చక్కెర పానకాన్ని పారబోశారు. ఇద్దరిని అరెస్టు చేసి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గుడుంబా వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, కావున గుడుంబాను సేవించరాదన్నారు. అలాగే గుడుంబాను గ్రామాల్లో ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో భూపాలపల్లి ఎస్‌హెచ్‌ఓ రమ్య, డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, భూపాలపల్లి ఎస్సై రబ్బాని, తదితరులు ఉన్నారు.

మల్లంపల్లిలో వృథాగా ఉన్న ట్రాక్టర్



కదలని బండి.. తొలగని చెత్త

చెత్త సేకరణ ట్రాక్టర్లకు అందని ఇంధనం

- ఇంటింటి చెత్త సేకరణకు ఆటంకం
- చిన్న పంచాయతీల్లో పూర్తిగా బంద్
- దుర్గంధం వెదజల్లుతున్న పల్లెలు



కమలాపూర్‌లో పేరుకుపోయిన చెత్త



మల్లంపల్లిలో..

భూపాలపల్లి రూరల్: పల్లెల్లో చెత్తసేకరణ నత్తనడకన సాగుతోంది. నిరంతరం కొనసాగాల్సిన ఈ ప్రక్రియ.. వారంలో ఒకటి, రెండు దఫాలే జరుగుతోంది. ట్రాక్టర్లలో డీజిల్ లేకపోవడమే ఇందుకు కారణం. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం.. ప్రభుత్వాలనుంచి నిధులు నిలిచిపోవడం.. పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మొన్నటి వరకు అప్పు చేసి పనులు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు ఆర్థికభారం భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాక్టర్ల నిర్వహణ చూడలేమంటూ కొంత మంది కార్యదర్శులు ఇటీవల మండల పరిషత్ కార్యాలయాల్లో తాళం చేతులు అప్పగించారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్నులు తదితర నిధులు.. గ్రామ కార్యదర్శులు సొంత ఖర్చులతో వారంలో ఒకటి రెండుసార్లు ట్రాక్టర్లు తీస్తున్నట్లు సమాచారం. కానీ, చిన్న పంచాయతీల్లోని ట్రాక్టర్లకు డీజిల్ లేక షెడ్లకే పరిమితం అయ్యాయి.

పేరుకుపోతున్న చెత్త..

గ్రామ పంచాయతీల్లో దుర్గంధం నెలకొంది. క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగకపోవడం, మరోవైపు వానాకాలం కావడంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంలో ఒకటి రెండు దఫా చెత్త సేకరిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఊరిబయటకే చెత్త తరలించి దహనం చేస్తున్నారు. కొందరు తమ ఇళ్లలోని చెత్తను స్వయంగా డంపింగ్ యార్డులకు తీసుకెళ్లి పడేస్తున్నారు.

కార్యదర్శుల పైనే భారం..

సుమారు 18 నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు ఆగిపోవడం, ప్రత్యేకాధికారులు గ్రామాలవైపు చూడకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపైనే పడుతోంది. ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు ఇంతకాలం సొంత ఖర్చులతో సమస్యలు పరిష్కరించిన పంచాయతీ కార్యదర్శులు ఇక భరించలేమంటున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్ల నిర్వహణ భారం తడిసి మోపడవుతుందని వాపోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడం, ఆర్థిక భారం తమపైన పడుతుండడంతో భరించలేని పంచాయతీ కార్యదర్శులు తమ అసోసియేషన్ పిలుపు మేరకు ట్రాకర్ల నిర్వహణ చూడలేమంటూ మండల పరిషత్ కార్యాలయాల్లో తాళం చేతులు అప్పగించారు. కానీ, కొంతమంది మళ్లీ తీసుకెళ్లినట్లు సమాచారం. ఏదిఏమైనప్పటికీ గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ ప్రతిరోజూ చేపట్టాలని ప్రజలు కోరుతుండగా.. నిర్వహణ భారం తమపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

నిధులు నిల్..!

పల్లెల్లో చెత్త సేకరణ, మొక్కలకు నీరు పోసేందుకు గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున ట్రాక్టర్, ట్యాంకర్ మంజూరు చేసింది. అందులో భాగంగా జిల్లాలోని 241 జీపీలకు ఒక ట్రాక్టర్, చెట్లకు నీరు పోసేందుకు ఒక ట్యాంకర్ చొప్పున పంచాయతీలు ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేశాయి. మేజర్ పంచాయతీల్లో ప్రతి రోజూ, చిన్న గ్రామ పంచాయతీల్లో రెండు రోజులకు ఒకసారి తప్పనిసరిగా చెత్త సేకరించాల్సి ఉంటుంది. పెద్ద పంచాయతీలో డీజిల్ ఖర్చు నెలకు రూ.10 వేల వరకు, చిన్న గ్రామ పంచాయతీలో రూ.5 వేల చొప్పున ఖర్చు వస్తుంది. అయితే పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల కాలపరిమితి ముగియడంతో 15 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఈ ట్రాక్టర్ల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది.

ట్రాక్టర్ రాక నెల రోజులైంది..



చెత్త ట్రాక్టర్ రాక నెల రోజులవుతోంది. ఎండకాలంలో ట్రాక్టరు రాకున్న చెత్తను కాల్చినం. వారం రోజులుగా కొద్దిగా వానలు కురవడంతో చెత్త కాలడంలేదు. చెత్తతోటి ఈగలు, దోమలు ఎక్కువయ్యాయి. గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. అధికారులు స్పందించి చెత్తను తీయించాలి.

\- పాలకుర్తి కళమ్మ, కమలాపూర్

నిధులు లేవు



పంచాయతీల్లో ట్రాక్టర్ డీజిల్, మరమ్మతులకు నిధులు లేవు. 18 నెలలుగా నిధులు రావడంలేదు. కార్యదర్శులు ఇప్పటికే రూ.లక్షల్లో ఖర్చు చేశారు. ఇంటి పన్నులు వసూలు చేసిన నిధులు ట్రెజరీల్లో నిల్వ ఉంచారు. ప్రభుత్వం ట్రెజరీల నుంచి నిధులు విడుదల చేయించాలి. ప్రతినెలా టాక్టర్, వీధిలైట్లు, తదితర ఖర్చుల కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలి.

\- రాంబాబు, జిల్లా అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శుల సంఘం

చెత్త సేకరణపై చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో చెత్త తీస్తున్నారు. గతంలో కొంతమంది కార్యదర్శులు తాళాలు ఇచ్చి మళ్లీ తీసుకెళ్లారు. గ్రామాల్లో చెత్త తీస్తున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎక్కడైనా చెత్త సేకరణపై సమస్యలుంటే చర్యలు తీసుకుంటాం.

\- వీరభద్రయ్య, డీపీఓ

సింగరేణి పైరవీకారులపై ఏసీబీ దాడులు

- సింగరేణిలో యథేచ్ఛగా కారుణ్య నియామకాలు
- ఉద్యోగాల పేరిట కార్మిక కుటుంబాలపై వల
- ఏడాదిన్నరగా మెడికల్ దందాపై నజర్
- దాడులు, అరెస్టులు ప్రారంభించిన ఏసీబీ అధికారులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి పైరవీకారులపై విజిలెన్స్ విచారణతోపాటు ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. సింగరేణిలో అవినీతి పెరిగిపోవడంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏసీబీ నిఘా పెట్టింది. సింగరేణి మెడికల్ బోర్డులో అవినీతి చాపకింద నీరులా విస్తరిస్తుంది. పలువురు సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, చోట మోటా కార్మికులు సైతం లంచావతారమెత్తి సంస్థకు చెడు పేరును తీసుకొస్తున్నారు. ఈక్రమంలో భూపాలపల్లి ఏరియా కేటీకే 1వ గనిలో విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి కార్మికుడు సాదర్ల ప్రశాంత్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

గత ఏడాది నుంచి విచారణ

గతేడాది జనవరిలో మెడికల్ బోర్డులో జరుగుతున్న అవినీతి వ్యవహారంపై సంస్థ దృష్టి సారించింది. అందులో భాగంగా కారుణ్య నియామకాల్లో జరిగే అవినీతిపై నజర్ పెట్టాల్సిందిగా కోరుతూ సీఐడీ, ఏసీబీలను కోరుతూ 2024 జనవరిలో లేఖలు రాసింది. ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలంటూ సంస్థ కోరింది. అప్పటికే ఆరేడేళ్లుగా ఈ దందా సాగుతుండడంతో ఫిర్యాదులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో గతేడాది మేలో మెడికల్ బోర్డు అవినీతిపై కచ్చితమైన సమాచారం అందిస్తే రూ.10వేల బహుమతి అందిస్తామని, వివరాలు గోప్యంగా ఉంచుతామని సంస్థ పేర్కొంది. అవినీతి వివరాలు తెలిపేందుకు ప్రత్యేకంగా 94911 44104 వాట్సాప్ నంబర్ అందుబాటులోకి తెవడంతో ఫిర్యాదు రావడం మొదలైంది.

రూ.లక్షల్లో వసూళ్లు

సింగరేణి సంస్థలో ఒకప్పుడు వారసత్వ ఉద్యోగాలు ఉండగా.. 90వ దశకంలో ఈ విధానాన్ని రద్దు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వారసత్వ ఉద్యోగాల అంశం తెరమీదకు వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తే.. చట్టపరమైన చిక్కులు ఎదురయ్యాయి. దీంతో వారసత్వ ఉద్యోగాలకు అనధికారిక ప్రత్యామ్నాయంగా 2017లో కారుణ్య నియామకాలు తిరిగి మొదలయ్యాయి. అయితే కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంత మంది దళారులు డబ్బులు ఇస్తేనే ఉద్యోగాలు వస్తాయంటూ ప్రచారం చేశారు. చివరకు ఈ ప్రచారం బహిరంగంగానే స్థిరపడిపోయి ఒక్కో ఉద్యోగానికి కార్మికులు కనిష్టంగా రూ.ఐదు లక్షలు సిండికేట్‌కు ముట్టచెబితే తప్ప పని కాదనే నమ్మకానికొచ్చారు కారుణ్య నియామకాలకు వెళ్లే కార్మికులు.

ప్రత్యేక నిఘా పెట్టి..

సింగరేణి కారుణ్య నియామకాల దందాపై సీబీఐ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వేర్వేరు ఫోన్ కాల్స్ ద్వారా అందిన సమాచారాన్ని విశ్లేషించి, పక్కా ఆధారాలతో ఈ ఏడాది మే 6న కొత్తగూడెం మెయిన్ వర్క్‌షాపులో పని చేస్తున్న అన్నెబోయిన రాజేశ్వరరావు అనే ఉద్యోగిని ఏసీబీ అధికారులు టార్గెట్ చేశారు. అతని బ్యాంక్ ఖాతాల్లో రూ.32 లక్షల విలువైన నగదు ఉన్నట్టుగా గుర్తించారు. అతన్ని విచారిస్తే లభించిన సమాచారం. అప్పటికే తమ దగ్గరున్న వివరాలు, ఫిర్యాదుదారులు చెప్పిన అంశాలను బేరీజు వేసుకుని సరిగ్గా నెల రోజుల తర్వాత జూన్ 5న కొత్తగూడెం పట్టణంలో మరో మహిళ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ప్రస్తుతం ఆమె నుంచి వివరాలు రాబట్టే పని చేస్తున్నారు. వారి విచారణలో భూపాలపల్లి ఏరియాకు చెందిన ప్రశాంత్ సమాచారం బయటికి వచ్చింది. అంతేకాకుండా డబ్బులిస్తే కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బులు దండుకుంటున్న సంస్థేతర వ్యక్తులకు సంస్థలో ఉన్న ఉద్యోగులకు మధ్య జరిగిన లావాదేవీలపై పక్కా ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది.

ఏసీబీ అధికారుల అదుపులో సింగరేణి కార్మికుడు



ప్రశాంత్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1వ గనిలో విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి కార్మికుడు సాదర్ల ప్రశాంత్‌ను బుధవారం ఉదయం ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్, బృందం పట్టణంలోని ప్రశాంత్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. బ్యాంక్ అకౌంట్లు పరిశీలించి సెల్‌ఫోన్ తనిఖీ చేసి వారి వెంట తీసుకువెళ్లి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చినట్లు సమాచారం. సింగరేణి కారుణ్య నియామకాలు, కార్మికులను బదిలీలు చేయించేందుకు పలువురు కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. కొత్తగూడెం ఏరియాలోని రాజేశ్వర్‌రావు అనే కార్మికుడితో కలిసి పైరవీలకు పాల్పడ్డాడని గుర్తించారు. గత ఏడాది నుంచి సింగరేణి వ్యాప్తంగా సింగరేణి విజిలెన్స్ విభాగం, ఏసీబీ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ విచారణంలో ప్రశాంత్ పట్టుపడగా మరికొంతమంది పైరవీదారులు చిక్కే అవకాశం ఉంది.

మార్పు వచ్చింది..

ప్రభుత్వ పాఠశాలలపై ఆరు అంశాలతో పీజీఐ సర్వే

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23 కన్నా 2023-24 మెరుగ్గా ఫలితాలు
- శుభ సూచికం అంటున్న విద్యావేత్తలు



సాక్షి, మహబూబాబాద్: జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలు మొదలైన ఆరు అంశాలపై నిర్వహించిన ఫెర్మార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్(ఎఫ్‌జీఐ) నివేదిక మెరుగ్గా ఉంది. గత రెండు సంవత్సరాల కంటే.. గడిచిన విద్యాసంవత్సరంలో ఫలితాలు మెరుగ్గా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఆరు అంశాల్లో 74 సూచికలకు 600 మార్కులు కేటాయించారు. ప్రతీ పాఠశాల నుంచి యూడైస్‌లో పొందుపర్చిన అంశాలను పరిశీలించి, సేకరించిన వివరాల ప్రకారం జాతీయ స్థాయిలో జిల్లాల వారీగా మార్కులు కేటాయించారు.

ఆరు అంశాలుగా పరిశీలన..

ప్రభుత్వ పాఠశాల పనితీరుకు అద్దం పట్టే ప్రధాన అంశాలను పరిశీలించారు. ఇందులో ఆరు అంశాల్లో 74 సూచికలను పేర్కొని మార్కులు వేశారు. మొదటి అంశంగా.. అభ్యసన ఫలితాలు, సామర్థ్యాలు, సంబంధాలు, ఉపాధ్యాయుల లక్ష్యాలు, నైపుణ్యాలు, రెండో అంశం.. బోధన నిర్వహణ, పిల్లల ప్రతిస్పందన, మూడో అంశం.. మౌలిక సదుపాయాల కల్పన, సౌకర్యాలను పరిశీలించారు. అలాగే పాఠశాలల భద్రత, పిల్లల రక్షణ, డిజిటల్ లర్నింగ్, నిధుల వినియోగం, హాజరు పర్యవేక్షణ, పాఠశాలల్లో నాయకత్వ లక్షణాలు మొదలైన విషయాలను పరిశీలించారు. మొదటి రెండు అంశాల్లో గతం కంటే మెరుగైన మార్కులు సాధించగా.. మౌలిక వసతుల కల్పన, డిజిటల్ లర్నింగ్‌లో 2022-23 విద్యా సంవత్సరం కంటే 2023-24 విద్యా సంవత్సరంలో వెనకబడినట్లు తేలింది. అయితే గత విద్యా సంవత్సరం 2024-25లో మాత్రం అన్ని అంశాల్లో మెరుగుపడ్డామని, ఇందుకు ఈ ఏడాది పదో తరగతిలో సాధించిన ఫలితాలే నిదర్శనమని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

గతం కన్నా మెరుగు..

ఆరు అంశాల్లో 2022-23 విద్యా సంవత్సరం కంటే 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగు పడినట్లు స్పష్టమవుతోంది. ప్రధానంగా అభ్యసన ఫలితాలు, సమన్వయం, ఉపాధ్యాయుల పనితీరుపై మొత్తం 24 సూచికలకు 290 మార్కులు కేటాయించగా 2022-23 సంవత్సరంలో హనుమకొండ జిల్లా 109 మార్కులు సాధించింది. అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాకు 79 మార్కులు వచ్చాయి. అయితే 2023-24లో హనుమకొండ జిల్లాకు 122 మార్కులు రాగా మహబూబాబాద్‌కు 95 మార్కులొచ్చాయి. అలాగే మౌలిక సదుపాయాల కల్పనపై 12 సూచికల్లో 51 మార్కులకు 2022-23లో మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు 29 మార్కుల చొప్పున వచ్చాయి. అదే మరుసటి సంవత్సరం హనుమకొండకు 29 మార్కులు రాగా మహబూబాబాద్ జిల్లాకు 27 మార్కులు వచ్చాయి. పాఠశాలల్లో పిల్లల భద్రతపై 31 మార్కులకు జనగామ, హనుమకొండ, ములుగు జిల్లాలకు 10 మార్కులకు పైగా రాగా మిగిలిన జిల్లాల్లో తక్కువగా వచ్చాయి.

ఉమ్మడి జిల్లాల వారీగా ఆరు అంశాల్లో సాధించిన మార్కుల వివరాలు

జిల్లా	మొత్తం మార్కులు	2022-23	2023-24
వరంగల్	600	226	245
హనుమకొండ	600	250	275
మహబూబాబాద్	600	210	229
జనగామ	600	235	271
భూపాలపల్లి	600	220	253
ములుగు	600	214	231

బాలాజీ.. పీఎఫ్ బోలోజీ

- ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్ డ్రైవర్ల పీఎఫ్ సొమ్ము కాజేస్తున్న కన్సల్టెన్సీలు..
- మొదటి మూడు నెలలు జేబీఎంకు డ్రైవర్లను సమకూర్చిన శ్రీ బాలాజీ
- ఆ తరువాత తప్పుకుని సిస్‌కాన్‌కు అప్పగింత
- 287మంది డ్రైవర్ల వద్ద పీఎఫ్ కోసం రూ.3 వేల చొప్పున కోత
- ఐదు నెలలైనా పీఎఫ్ ఖాతాలు ప్రారంభించని శ్రీ బాలాజీ, సిస్‌కాన్
- తమ సొమ్ము కాజేతపై ఆందోళన చెందుతున్న డ్రైవర్లు



జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులు

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్న జేబీఎంకు డ్రైవర్లను సమకూర్చిన శ్రీ బాలాజీ కన్సల్టెన్సీ పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో జీతంలో కోత పెట్టింది. కానీ ఆ సొమ్మును పీఎఫ్ ఖాతాలో జమ చేయలేదు. మూడు నెలల పాటు జేబీఎంకు డ్రైవర్లను సమకూర్చిన శ్రీ బాలాజీ కన్సల్టెన్సీ తప్పుకున్న తర్వాత సిస్‌కాన్ ప్రస్తుతం రెండు నెలలకు పైగా డ్రైవర్లను సమకూరుస్తోంది. ఈ రెండు సంస్థలు గత ఐదు నెలలకుపైగా పీఎఫ్ ఖాతాలు ప్రారంభించలేదని, కానీ, జీతాల్లో కోత పెడుతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. ఈ రెండు సంస్థలు కలిపి ఇప్పటివరకు ఐదు నెలల కాలానికి ఒక్కో డ్రైవర్ నుంచి నెలకు రూ.3 వేల చొప్పున కట్ చేశారు. 287 మంది డ్రైవర్లు జేబీఎం బస్సులు నడుపుతున్నారు. ఈ లెక్కన నెలకు రూ.8.61 లక్షలు వసూలు చేశారు. ఐదు నెలలకు 287 మందినుంచి రూ.43.05 లక్షలు కోత పెట్టారు. ఈ సొమ్ము ఎవరి చేతుల్లోకి వెళ్లిందని జేబీఎం డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు.

112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయింపు..

టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది. వీటిలో 19 సూపర్ లగ్జరీ, 18 డీలక్స్, 75 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. జేబీఎం సంస్థ నిర్వహణలో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. ఈ మేరకు టీజీఎస్ ఆర్టీసీతో ఒప్పందం చేసుకుంది. వీటిని జనవరి 6న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రారంభించారు.

కన్సల్టెన్సీ ప్రతినిధి ఏమంటున్నారంటే..

ఈ విషయమై గతంలో శ్రీ బాలాజీ కన్సల్టెన్సీ ప్రతినిధిగా, ప్రస్తుతం సిస్‌కాన్ బాధ్యుడిగా పని చేస్తున్న వేణుమాధవ్‌ను వివరణ కోరగా త్వరలో డ్రైవర్లకు పీఎఫ్ ఖాతాలు ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో వసూలు చేసిన సొమ్మును తిరిగి డ్రైవర్లకు జీతాలతో కలిపి చెల్లించనున్నట్లు చెప్పారు.

జీతాలు ఓకే.. పీఎఫ్, ఈఎస్ఐ కోతలు ఎక్కడికెళ్లాయి..?

జేబీఎం సంస్థకు శ్రీ బాలాజీ కన్సల్టెన్సీ డ్రైవర్లను సమకూర్చింది. మొదటి మూడు నెలలు డ్రైవర్లను అందించిన ఈ సంస్థ ఆ తరువాత తప్పుకుంది. ఈ స్థానంలో గత రెండు నెలలకు పైగా (జూన్‌తో 3 నెలలు) సిస్‌కాన్ డ్రైవర్లను సమకూరుస్తోంది. డ్రైవర్లను సమకూరుస్తున్నందుకు జేబీఎం.. ఆ సంస్థలకు చెల్లింపులు చేస్తోంది. శ్రీ బాలాజీ మూడు నెలలపాటు డ్రైవర్లకు జీతాలు చెల్లించింది. ఈ క్రమంలో పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో నెలకు రూ.3 వేల చొప్పున జీతంలో కోత పెట్టిందని జేబీఎం డ్రైవర్లు తెలిపారు. గత రెండు నెలలు జీతం చెల్లించిన సిస్‌కాన్ కూడా నెలకు రూ.3 వేల చొప్పున కోత పెట్టిందని డ్రైవర్లు చెప్పారు. ఈ లెక్కన శ్రీ బాలాజీ కన్సల్టెన్సీ 287 మంది డ్రైవర్ల నుంచి మూడు నెలలకుగాను రూ.25.83 లక్షలు వసూలు చేసింది. అదే విధంగా సిస్‌కాన్ రెండు నెలలకు రూ.17.22లక్షలు వసూలు చేసిందని డ్రైవర్లు వివరించారు. అయినా ఐదు నెలలకుపైగా తమకు పీఎఫ్ ఖాతాలు ప్రారంభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్ద వసూలు చేసిన సొమ్ము ఏమైందని ప్రశ్నిస్తున్నారు. వసూలు చేసిన సొమ్మును పీఎఫ్ ఖాతాల్లో జమ చేస్తారా... నేరుగా తమకే తిరిగి చెల్లిస్తారా అని నిలదీస్తున్నారు. తమ జీతంలో కోత పెట్టి వసూలు చేసిన సొమ్మును కన్సల్టెన్సీ సంస్థలు సొంతానికి వాడుకుంటే ఊరుకునేది లేదని జేబీఎం డ్రైవర్లు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

- టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీందర్‌రెడ్డి



మెడికల్ కళాశాలలో పరిశీలిస్తున్న ఎండీ ఫణీందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలంగాణ మెడికల్ సైన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ఎండీ ఫణీందర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావుతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల, హాస్టల్, ఆస్పత్రి భవనాలతోపాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని వార్డులు, ప్రయోగశాలలు, తరగతి గదులు, పరికరాలను పరిశీలిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఈ సంవత్సరం ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి నివేదికను వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శికి సమర్పించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. విద్యార్థుల వసతి సౌకర్యాలకు సింగరేణి సంస్థ నుంచి ప్రత్యేక బ్లాక్ కేటాయించనున్నట్లు తెలిపారు. నిర్మాణంలో ఉన్న బ్లాకులు, ల్యాబ్‌లు, మెడికల్ పరికరాలను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, ఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధురాలి ప్రాణం తీసిన చింతచెట్టు

- తెగిపడిన విద్యుత్ తీగలు పట్టుకుని రాజమ్మ మృతి
- అదే తీగల్లో పడి నాలుగు పశువులూ మృత్యువాత



విద్యుదాఘాతంతో మృతిచెందిన రాజమ్మ, పక్కన పశువులు



రాజమ్మ(ఫైల్)

వాజేడు: పంట సాగు చేస్తున్న ప్పుడల్లా చింతచెట్టు నీడ పడి పంట మంచిగా రావడం లేదని, ఆ చెట్టును తొలగిస్తే పంట బాగుంటుందని భావించారు వృద్ధ దంపతులు. కానీ, ఆ చెట్టు రూపంలోనే దూసుకొచ్చిన మృత్యువు ఆ దంపతుల్లో భార్య ప్రాణం తీసింది. ఈ ఘటన ములుగు జిల్లా వాజేడు మండలం మోతుకులగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతుకులగూడెం గ్రామానికి చెందిన బండి నారాయణ, రాజమ్మ(65) దంపతులు ఆ గ్రామంనుంచి వచ్చి రేగులపాడులో కొడుకు, కోడలితో కలిసి ఉంటున్నారు. మోతుకులగూడెం గ్రామంలో ఉన్న ఇంటి స్థలాన్ని బాగు చేసి కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నారు. ఆ స్థలంలో ఒక పక్కన చింతచెట్టు ఉండడంతో సాగుకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఆలోచనతో దానిని కూలీలను పెట్టి నరికిస్తున్నారు. తెగిన కొమ్మలను తాడుకట్టి పక్కకు లాగడంతో కొమ్మ తెగి విద్యుత్ తీగల మీద పడ్డాయి. దీంతో తీగలు తెగి కిందపడ్డాయి. తీగలు పడిన వైపు ఉన్న రాజమ్మ.. అటువైపుగా వస్తున్న రామక్క అనే మరో మహిళతో మాట్లాడుతూ తెగిపడిన తీగలను పక్కకు వేయాలనే ఉద్దేశంతో వాటిని పట్టుకుంది. వ్యవసాయ పనుల కోసం ఏర్పాటు చేసిన త్రీఫేజ్ విద్యుత్ లైన్ కావడంతో రాజమ్మ పట్టుకున్న తీగ చేతిలో ఉండగానే అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే మేస్తున్న పశువులు నాలుగు తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడ్డాయి. వెంటనే అక్కడికి చేరుకున్న గ్రామస్తులు మిగతా పశువుల గుంపును దూరంగా పంపించి విద్యుత్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. భర్త నారాయణ విద్యుత్ తీగలు తెగిపడిన వైపు కాకుండా మరోవైపు ఉండడంతో అతనికి ఏమీ కాలేదు. కాగా, ఇన్ని రోజులు త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌కు సరఫరా లేకపోగా, వరి నార్లు పోసుకుంటామని కొందరు రైతులు కోరడంతో విద్యుత్ సరఫరా చేసినట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన పోలీసులు వివరాలు సేకరించారు. విద్యుత్ తీగల బారిన పడి తల్లి మృతిచెందడంతో కొడుకు, కోడలు, కూతురు రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం..

ఖిలా వరంగల్: రైల్వే డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగాలిప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు ఓ మహిళను మోసం చేశారు. ఆమెకు మాయమాటలు చెప్పి రూ.3.50 లక్షలు వసూలు చేశారు. వరంగల్ విశ్వనాథ కాలనీకి చెందిన ఇంజమూరి భాగ్యలక్ష్మి మేనబావ ఆడెపు నరేందర్ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీప కాలనీలో నివాసం ఉంటున్నాడు. భాగ్యలక్ష్మి ఇంటికి వచ్చిన నరేందర్ 'నీ కుమారుడు వంశీకృష్ణకు ఉద్యోగం పెట్టిస్తా. నాకు తెలిసిన ఒక వ్యక్తి నల్లగొండ బాబూరావు హైదరాబాద్‌లో ఉంటాడు. అతడి ద్వారా రైల్వేలో కాంట్రాక్టు ఉద్యోగం పెట్టిస్తా. ఒక వేళ ఉద్యోగం రాకపోతే మూడు నెలల్లో డబ్బులు తిరిగి ఇస్తాడు' అని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన భాగ్యలక్ష్మి 2023 జనవరిలో పలు దఫాలుగా ఆన్‌లైన్‌లో రూ.3.50 లక్షలు చెల్లించింది. రెండేళ్లు గడిచినప్పటికీ ఉద్యోగం పెట్టివ్వకపోగా ముఖం చాటేయడంతో భాగ్యలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. దీంతో నరేందర్, బాబురావుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

సారూ.. 600 మంది రైతుల గోస అర్థం చేసుకోండి..

పోలీస్ అధికారి కాళ్లు పట్టుకుని వేడుకున్న మహిళా రైతు

- మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట నారాయణపురం రైతుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న నారాయణపురం గ్రామ రైతులు



పోలీసు అధికారి కాళ్లు పట్టుకుని తమకు సహకరించాలని కోరుతున్న మహిళా రైతు

మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి 600 మంది రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. రైతులు లకుపతి, బాషా, జాన్ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా, ఓ మహిళా రైతు పోలీస్ అధికారి కాళ్లపై పడి తమకు సహకరించాలని, 600మంది రైతుల గోస అర్థం చేసుకోవాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నారాయణపురం గ్రామంలో 60 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న 1,827 ఎకరాలను 2017లో అప్పటి ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా అటవీ భూములని పేర్కొని పట్టాలు రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 94 జారీ చేసి రైతు పేరు, తండ్రి పేరున ఉన్న అడవి అనే పదం తొలగించిందన్నారు. గ్రామంలో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి ఆరు నెలలు పూర్తయినా పట్టాలు జారీ చేయలేన్నారు. దీంతో పాస్ పుస్తకాలు లేకపోవడంతో దాదాపు 600 మంది రైతులకు పంట రుణాలు, రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా, ఇతరత్రా పథకాలు అందడం లేదన్నారు. వెంటనే సర్వే ప్రకారం పట్టాలు ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారికి వినతి పత్రం అందజేశారు. డీఎస్పీ తిరుపతి రావు ఆధ్వర్యంలో సీఐలు మహేందర్ రెడ్డి, సర్వయ్య బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ధారవత్ రవి, నాయకులు, రైతులు శ్రీనివాస్, శంకర్, వెంకట్‌రెడ్డి, వీరన్న, సురేశ్, కిషన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణీయ, హిందూ ఫాసిస్ట్‌కు వ్యతిరేకంగా పోరాడుదాం

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతిరావు



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి రావు

వరంగల్ చౌరస్తా: బ్రాహ్మణీయ, హిందూ ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాసంఘాలు పోరాడాలని, ఇందుకు సమయం ఆసన్నమైందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతిరావు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా పనిచేస్తోందని విమర్శించారు. బడా కార్పొరేట్‌లు అంబానీ, ఆదానీలకు ప్రధాని మోదీ సీఈఓ పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. మధ్య భారతంలో మావోయిస్టులు, ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండ దీనికి నిదర్శనమన్నారు. అనంతరం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర రావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం శత్రువు దేశంగా ప్రకటించిన పాకిస్తాన్, ఈశాన్య రాష్ట్రాల్లో సాయుధ ఉద్యమాలు చేస్తున్న సంస్థలతో చర్చలు జరిపిందన్నారు. కానీ మావోయిస్టులతో మాత్రం చర్చలు ఉండవని ప్రకటించడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా మధ్య భారతంలో హత్యాకాండను ఆపి మావోయిస్టులతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మండల వెంకన్న, కె.గోవర్ధన్, ఆవునూరి మధు, గొని ఐలయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ముక్తి, సత్యం, రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర సదస్సుకు ఆ పార్టీ నాయకులు వారం క్రితం పోలీసు అధికారుల అనుమతి కోరగా వారు నిరాకరించారు. అయితే మరోసారి పార్టీ నాయకులు విజ్ఞప్తి మేరకు అనుమతి ఇవ్వగా సదస్సు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు జరిగింది.

అధిక కరెంట్ బిల్లు తెచ్చిన విషాదం..

- బిల్లుపై అధికారిని అడిగొస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం
- వృద్ధురాలి దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు



ఐలమ్మ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: ఇంటికి అధిక కరెంట్ బిల్లు రాగా ఎందుకొచ్చిందని తెలుసుకునేందుకు వెళ్లిన సందర్భంలో ఓ వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కంచర్లగూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అవిరబోయిన ఐలమ్మ (69) ఇంటికి కరెంట్ బిల్లు అధికంగా (రూ.28 వేలు) వచ్చింది. దీంతో ఐలమ్మ, తన కుమారుడు నాగేశ్ ఆ విషయం తెలుసుకునేందుకు ఆటోలో ఉదయం కురవి మండల కేంద్రానికి వెళ్లి విద్యుత్ శాఖ అధికారితో మాట్లాడారు. అనంతరం తిరుగు ప్రయాణంలో నరేశ్.. తన తల్లి ఐలమ్మను ఆటోలో తీసుకొచ్చి మానుకోటలోని కురవి గేట్ ప్రాంతంలో వదిలిపెట్టాడు. తన ఆటో సీరియల్ ఆలస్యమవుతుందని పోలంపల్లి తండాకు చెందిన బాలు ఆటోలో తల్లిని ఇంటికి పంపించగా ఇదే ఆటోలో మరో ప్రయాణికుడు కూడా వెళ్లాడు. ఆటో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి సాలార్ తండా దాటి రాజోలు వైపునకు వెళ్తుండగా ఎదురుగా కురవి నుంచి మహబూబాబాద్ వైపునకు వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐలమ్మ ఆటో నుంచి కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందగా ద్విచక్రవాహనంపై ఉన్న మానుకోట పట్టణానికి చెందిన పుచ్చకాయల తరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఐలమ్మ, తరుణ్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తరుణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు. కురవి ఎస్సై సతీశ్ ఘటనాస్థలిని సందర్శించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగకు సరుకులు కొనడానికి వస్తూ.. మృత్యుఒడికి

- డీసీఎం, బైక్ ఢీ.. అక్కడికక్కడే ఇద్దరు యువకుల దుర్మరణం
- కర్ణాలకుంట వద్ద ఘటన



హకీం పాషా(ఫైల్)



కుమారస్వామి(ఫైల్)

చిట్యాల: మొహర్రం పండుగకు సరుకులు కొనడానికి వస్తున్న ఇద్దరు యువకులు మృత్యుఒడికి చేరారు. డీసీఎం, బైక్ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం బుధవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఏలేటిరామయ్యపల్లి గ్రామ శివారు కర్ణాలకుంట వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నవాబుపేటకు చెందిన ఎండి.హకీం పాషా(20), కైలాపూర్‌కు చెందిన సకినాల కుమారస్వామి (21) పని నిమిత్తం బైక్‌పై నవాబుపేట నుంచి చిట్యాలకు వస్తున్నారు. ఈ క్రమంలో చిట్యాల నుంచి నవాబుపేట వైపునకు వెళ్తున్న డీసీఎం కర్ణాలకుంట వద్ద ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎండి. హకీం పాషా, కుమారస్వామి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కాగా, కుమారస్వామి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఎండి.హకీం పాషా గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నవాబుపేటలో ప్రతీ సంవత్సరం జరిగే మొహర్రం వేడుకలకు కుమారస్వామి హాజరయ్యేవాడు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు తన స్వగ్రామం కైలాపూర్ వచ్చాడు. ఈ క్రమంలో కమారస్వామి నవాబుపేటకు వెళ్లాడు. అనంతరం ఇద్దరు కలిసి మొహర్రం పండుగకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేసేందుకు బైక్‌పై చిట్యాలకు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని బోరున విలపించారు. ఇద్దరి మృతదేహాల మీద పడి గుండెలవిసేలా రోదించారు. ఈ విషయం తెలుసుకున్న చిట్యాల ఎస్సై -2 ఈశ్వరయ్య సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను సివిల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- రూ.8 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం

గార్ల: తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. రూ.8 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం గార్ల పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గార్లకు చెందిన మూడు నిఖిల్, బేతి అరవింద్ వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా గత మార్చి 23 నుంచి మే 10వ తేదీల మధ్య తాళం వేసి ఉన్న పలు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. అలాగే, ఇటీవల గార్లలోని కొలిమికొట్టం బజారులో తాళం వేసి ఉన్న బాదావత్ కేస్లీ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.2,15,000 విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసిన వారి వద్ద నుంచి రూ. 8 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.3,600 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. కాగా, నిందితుడు నిఖిల్‌ను విచారణ నిమిత్తం పీఎస్‌కు తీసుకురాగా, పోలీసులను నెట్టివేసి పరారయ్యాడు. దీంతో పోలీసులు మరోసారి తీసుకురాగా పురుగుల మందు తాగానని, మీపేరు రాసి చనిపోతానని బెదిరించడంతోపాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు నిఖిల్‌పై మరో 2 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో గార్లబయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై రియాజ్‌పాషా, సిబ్బంది తిరుమలరావు, సుధాకర్, శ్రీను, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందవేమోనని...

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

- హెచ్ఎంగా 9నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందిన సోమిరెడ్డి
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన



సోమిరెడ్డి (ఫైల్)

నెల్లికుదురు: ఆయనో ప్రధానోపాధ్యాయుడు. ఉద్యోగ విరమణ పొంది 9 నెలలైంది. ఇంకా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాలేదు. దీంతో మనోవేదనకు గురై అనారోగ్యం బారిన పడి చనిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాజుల కొత్తపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుల కొత్తపల్లి గ్రామానికి చెందిన కొండేటి సోమిరెడ్డి (63) హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ గత ఏడాది సెప్టెంబర్ 30న విరమణ పొందాడు. నాలుగు నెలలలోపు ప్రభుత్వంనుంచి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సుమారు రూ.56 లక్షలు 9నెలలైనా అందలేదు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పొందేవారు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8వేల మంది ఉన్నారని, వారిలో నీకు అందే వరకు ఎన్నేళ్లు పడుతుందోనని స్థానికులు రకరకాలుగా మాట్లాడారు. దీంతో తనకు ఆ డబ్బులు వస్తాయో..రావోనని, కూతురుకు, ఇతరులకు సెటిల్‌మెంట్లు చేయాల్సి ఉందని మదనపడుతుండేవాడు. ఇలా మనోవేదనకు గురైన సోమిరెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమిరెడ్డి మంగళవారం రాత్రి చనిపోయాడు. ఉద్యోగ విరమణ పొందిన నాలుగు నెలలలోపే అందించాల్సిన రిటైర్ మెంట్ బెనిఫిట్స్ అందలేదని, సమయానికి బెనిఫిట్స్ ప్రభుత్వం అందిస్తే తమ నాన్న బతికేవాడని మృతుడి కుమారుడు కొండేటి కిశోర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య సునీత, ఒక కొడుకు కిశోర్‌రెడ్డి, కూతురు ఉన్నారు.

మోడల్ షాదీఖానాగా తీర్చిదిద్దుతాం

- ఉర్దూ అకాడమీ అధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్



షాదీఖాన వద్ద అధికారులు, నాయకులతో ఉర్దూ అకాడమీ అధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్

న్యూశాయంపేట: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని షాదీఖానాను రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఉర్దూ అకాడమీ అధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాను బుధవారం పరిశీలించారు. నిర్మాణం ఆలస్యంపై అధికారులను ఆరా తీశారు. ఇప్పటివరకు కేటాయించిన నిధులను ఏ మేరకు ఖర్చు చేశారో 'కుడా' ఏఈని వివరాలు అడిగారు. షాదీఖాన నిర్మాణం కోసం 'కుడా' రూ.3కోట్ల 50 లక్షల అంచనాతో పనులు చేపట్టామని, ఇప్పటివరకు గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి, రెండో అంతస్తులు స్లాబ్ వరకు పనులు పూర్తి అయినట్లు ఏఈ భరత్ వివరించారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తికావాలంటే ఏమేరకు నిధులు అవసరమవుతాయో అంచనా వేసి తనకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ సహకారంతో అద్భుత షాదీఖాన నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఏడీ వి.కృష్ణ, కార్పొరేటర్లు సురేశ్ జోషి, మహ్మద్ ఫుర్ఖాన్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి టి.రమేశ్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సూపరింటెండెంట్ విజయపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆయూబ్, చాంద్‌పాషా, ఆజం, యాకూబ్‌పాషా, సిరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎంఏ తెలుగులో ప్రవేశాలకు గడువు పెంపు

హన్మకొండ కల్చరల్: వరంగల్ హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2025-26 విద్యా సంవత్సరానికి రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశానికి గడువు ఈనెల 24తో ముగిసింది. రూ.100 ఆలస్య రుసుముతో జూన్ 30 వరకు ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని.. ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 99894 17299, 99891 39136 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సోమిడిలో చోరీ

- రూ.2.50 లక్షల విలువైన ఆభరణాల అపహరణ



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చొరబడి తులం బంగారం, 49 తులాల వెండి నగలు, రూ.లక్ష నగదును అపహరించుకెళ్లారు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. మేకల రమ తన ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఈక్రమంలో బంగారు, వెండి నగలతో పాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

- కపిల్ చిట్స్‌లో బ్రోకెన్ చిట్స్ కలవు. ష్యూరిటీ పెట్టి స్పాట్ క్యాష్ ఇప్పించబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి. సెల్: 8790379618. [WA-6713]

డాక్యుమెంట్స్ పోయినవి

- RAJEEV KANAKALA, S/o. DEVADAS KANAKALA, R/o. Villa No. 31, Narsing K.V. Ranagareddy District - 500089, Telangana State గార్డవి Original 2 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ issued by SRO చేర్యాల Gift Deed Bearing No: 3646/2010 & 3650/2010 గలవి. జనగామ టౌన్‌లో పోయాయి. దొరికినవారు సంప్రదించవల్సిన సెల్ నెంబర్: +91 8106182345. [SCA25005499]

CHANGE OF NAME

- I, the undersigned GOTTI MUKKULA RAMESH (new name) previously called GUTTEMULLULA RAMESH (old name), S/o. GOTTIMUKKULA LAXMAIAH, R/o. H.No: 5-143, Girnibavi, Togarri, Duggondi, Warangal - 506331, Telangana State, India (address) solemnly declare. [WA-2662]

BUSINESS OFFER

- అధిక సంపాదన కోసం ఎదురు చూస్తున్నారా మీ సొంత ఇంటర్నేషనల్ క్యాపిటల్ మార్కెట్ ట్రేడింగ్ అకౌంట్లో సంపాదించండి ప్రాఫిట్ షేరింగ్ ఫిక్స్‌డ్ రిటర్న్ సేఫ్&సెక్యూర్ సంప్ర: 6301859174 [SCA25005424]

BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214 [H-783418]

WANTED

- ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th - డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239 [SCA 25005435]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No.1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్‌కై M/F వర్కర్స్ కా॥ భో+వ+జీ: 16-18 వేలు. 9515119570, 9553461177 [SCA25005422]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.